మేమిటంటే వాడి గుర్రం వెనకాల వస్తున్న రెండో గుఱ్ఱం పడిపోయి కాలు విరిగిపోయింది."

"అప్పుడు నే నక్కడే వున్నాను. అంత విషాదకృత్యం నే నెప్పుడూ చూడలేదు" అన్నా డొకడు.

సరోజ శాంతమైన ముఖం విషాదంతో నిండిపోయింది. ఆమె ఆ దుర్వార్త విని చాలా బాధపడింది. "అత నెవరో చాలా మోటు వాడయి వుండాలి. లేకపోతే సాధారణంగా గుఱ్ఱంమీంచి పడడం జరగదు" అంది.

దాసు యింతవరకూ నిశ్శబ్దంగా విన్నాడు. ఆమె అన్న మాటలు అతన్ని కలచివేశాయి. అతను చొరవ చేసుకుని మాట్లాడాడు. "క్షమించండి. వీళ్ళకి అసలు సంగతి తెలియదు" అన్నాడు. అందరూ అతనివైపు తిరిగి చూశారు-"ఎవరీ ఆగంతుకు" డన్నట్టు.

"ఈవేళ ప్రొద్దుట పేపర్లో ఆ ఘోర ప్రమాదం వివరాలన్నీ చదివాను. ఆ మోటుమనిషిని రక్తపు మడుగులోంచి తీసి వాళ్ళ తల్లి దగ్గరకు మోసుకెళ్ళారు. అరవై సంవత్సరాల వృద్ధురాలు ఆతల్లి దుఃఖంతో పిచ్చెత్తిపోయింది. ఆ శవా న్నింకా పూడ్చలేదు. పిచ్చాసుపత్రిలో ఒక చిన్న గదిలో దుఃఖంతో, నిరాశతో, ఆవేదనతో గగ్గోలు పెట్టే అతని తల్లి వుందిట' అన్నాడు.

శేషగిరి రామదాసు వివరించిన పద్ధతి చాలా మోటుగా వుందనుకున్నాడు అతని అనాగరికతను పోగొట్టటం తనకు సాధ్యం కాదనుకొన్నాడు.

రామదాసు మాటాడుతూవుంటే సరోజ అతనికేసి నిదానంగా చూసింది. అతను చెప్పటం పూర్తిచేయగానే రెండు కన్నీటిబొట్లు ఆమె చెంపలమీదకు జారాయి. ఆమెలో ఆ దీనుల మీద సానుభూతి, ఆ సంగతి వివరించి చెప్పినందుకు దాసుమీద కృతజ్ఞత ఏర్పడ్డాయి.

ఆమె కార్చిన కన్నీళ్ళ వంక రామదాసు ఎంతో ఆనందంగా చూశాడు.

(సశేషము)

కొత్తపద్ధతులు

# సాహిత్యవిచారం

21-10-49

"రావు"

ఏమోయ్, బ—రాసిన కొత్త పద్యాలు విన్నావ్?

నా కతనిమాట చెప్పకోయ్!

అదేం?

అతను జుట్టంత పొట్టిగా కత్తిరిస్తాడేం?

అదేనా చూశావ్? బట్ట ఎట్లా కడతాడో గమనించావ్?

ఛీ, ఛీ!...ఇంకా, నన్నడిగితే పుర్-చక్కగా పద్యాలు రాస్తాడు. అతని లాల్చీలు చూశావూ? ఎక్కడ సంపాదిస్తాడోయ్ ఆ మల్లూ? అతనికి సినిమాలు చూడటంలోకూడా మాంఛి అనుభవం ఉంది సుమా! హాలీవుడ్ స్టార్లందర్నీ అతను గుర్తుపట్టగలడు—నిన్న కాక మొన్న వచ్చిన వాళ్ళనుకూడా!

సరేగాని, నీకు త్రా—కవిత్వం ఎలా ఉంటుందీ?

బాగానే ఉంటుంది గాదూ?

ఎబ్బే! అతని సంగతి నీకు తెలీదన్నమాట!

ఏమిటదీ?

అతను పచ్చి కమ్యూనిస్టు! ఆ ఆర్భాటమంతా ఏమి టనుకున్నావ్?

ఛా!

ఆ కమ్యూనిజం తప్పిస్తే అందులో ఏముందీ? నా బూడిదా!

టూ—కూడా కమ్యూనిస్టేటగా?

ఒక్కనాటికి కనుకో మాక! అతను అటు సూర్యు డిటు పొడిచినా కమ్యూనిస్టు కాడు.

21-10-49

మొన్న నాలుగుపద్యాలు రాశాడూ! చంపే శాల్లే! భలే రాశాడు.

నాకు తెలవదు లే! నే నెప్పుడో చూశా! పెట్టుబడిదార్లను తిట్టినట్టుగా ఉంది.

అదంతా అదో ఎత్తులే, ఏడిపించటం.

చెప్పవేం?

శా—ఈమధ్య ఓకథ రాశాడు చూశావ్?

ఆ బొమ్మలతో పడ్డ కథేనా? అవేం బొమ్మ లోయ్? వొట్టి వెధవ కథ!

ఆబొమ్మ వేసేవాణ్ణి చూస్తే నువ్వాకథ కేసి చూడనన్నా చూడవు!

అసహ్యంగా ఉంటాడా?

కంపులే. ఇంతింత పళ్ళు...—త్రం కథలు నీకెట్లా ఉంటై?

ఛా, ఛా! అటువంటి పేరుగలవాడు ఏది రాసినా చదవరాదనుకో. సచేల స్నానం చేయ వలసిందే—పొరపాటున ఎవరన్నా చదివితే వినాలిసి వస్తే.

కొంతమంది కీ విషయంలో బొత్తిగా నియ మాలే ఉండవోయ్. అదేమిటో వాళ్లు ఏ వెధవ ఏదిరాసినా చదువుతారు.

వెంకట్రావల్లే!

అబ్బ! ఆ వెంకట్రావు సంగతి చెప్పకోయ్! వాడు అభ్యుదయ రచనలుకూడా చదువు తాడు.

అసలు పిల్లి కళ్ళవాణ్ణి గురించి చాలా జాగ ర్తగా ఉండాలి.

తమాషా ఏమిటంటే వాడికి కూలి మనుషుల సాహిత్యం పని కొస్తుందిట గాని ఉత్తమ సెక్సు కథలు పనికిరావుట.

ఆఁ, వెధవపోజు! నన్నడిగితే వాడు చాటుగా అవే చదువుతాడు. వాడుమాత్రం మనిషికాదా ఏమిటి?

అసలు మన దేశంలో రాసేవా డెవడున్నా డోయ్? మొన్న కాశ్మీరునుంచి ఒక డొచ్చాడు. తెల్లగా అంత ఎత్తున, ఎంత దర్జాగా ఉన్నా డనుకున్నావ్? రాతగాడంటే అట్లా ఉండాలి.

మన తెలుగువాళ్ళ కన్న ఎవడన్నా నయమే నోయ్. మొన్న ఒక అరవవాణ్ణి చూశాను. ఎట్లా ఉన్నా డనుకున్నావ్- పచ్చగా దబ్బ పండల్లే! పద్యాలు రాస్తాట్ట! పద్యాలు రాసినా అటువంటివాడే రాయాలి.

అదేం ఖర్మమో తెలుగులో చదివితేనే ఏ దన్నా ఎంతో రోతగా ఉంటుందేం? బెంగాలీ వాళ్ళు చూడు. ఆ నవలారచయిత ఎవరూ—?

నాకూ నోట్లో ఆడుతున్నది.

అతను రాస్తాడుగదా?—ఎందుకులే.

నీకు బెంగాలీకూడా వచ్చునా ఏమిటి?

లేదోయ్. తెలుగులో తర్జుమాచేస్తే కొంచెం చూశా.

దాని పేరేమిటి?

అదేదో ఉండాలి.

అదే నేనూ రెండు పేజీలు చదివానోయ్. నువ్వు పూర్తిగా చదివావా?

ట్రైమేదోయ్? ఒకపేజీ చూశా! ఒక్క వాక్యం చదివితే తెలీదూ రంగూ? అన్నమంతా పట్టి చూడాలా?

బాగా చెప్పావ్!

మన తెలుగు సాహిత్యం ఇంతే. ఇంకేం బాగుపడేదుస్తుంది.

అబ్బాయీ, నే నొకటి చెబుతా వినూ. ఇప్పట్లో తెలుగు సాహిత్యం బాగుపడాలంటే మన సినిమా స్టార్లు తలుచుకుంటే బాగు పడాలి సిందే. ఏ సినిమాతారన్నా చక్కని కథల సంపుటి వేసి అట్టమీద షోకైన బొమ్మవేస్తే చూడ ముచ్చటగా ఉండదూ?

ఆ మాటన్నావు బాగుంది!

అసలు మన మొహాలకి తోమ సాహిత్య మెందుకోయ్?

దాని కర్మాంతరమా?

